క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి



చిలుకూరు(ఇబ్రహీంపట్నం): పంటలకు ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగమణి అన్నారు. చిలుకూరు గ్రామంలో వరద ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతుల సామాజిక తనిఖీలో గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే నష్టపోయిన పంటల జాబితాలు సచివాలయాల్లో ఉంచామని చెప్పారు. రైతులు తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలన చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వి.మనీషా పంటలు నష్టపోయిన రైతుల జాబితాను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏఓ డి.శైలజ, రైతులు పాల్గొన్నారు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎ.కొండూరు: మండలంలోని కొత్తరేవూడి గ్రామంలో వంతెనవాగు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నామని ఎస్‌ఐ చల్లా కృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వృత్తి విద్యపై అవగాహన పెరగాలి



మైలవరం: విద్యార్థులు వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండాలని ఎంబీఎం జెడ్పీ హైస్ ప్లస్ ప్రధానోపాధ్యాయిని పి. లక్ష్మి అన్నారు. పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థినులు, ఇంటర్మీడియెట్ విద్యార్థులు స్థానిక ఎల్బీ ఆర్‌సీఈ కళాశాలలో ఎలక్ట్రానిక్ పరిశోధనశాలను గురువారం సందర్శించారు. ఆధునిక టెక్నాలజీ పని తీరుపై కళాశాల అధ్యాపకులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నేటి ప్రపంచంలో ఆధునిక టెక్నాలజీ ఆవశ్యకతను వివరించారు. ప్రధానోపాధ్యాయిని పి. లక్ష్మి, శరత్, సూరిబాబు, గోపాలం, కళ్యాణి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాతా ప్రదర్శన

నూజివీడు: భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని కళాజాతా బృందం సభ్యులు అన్నారు. ఎం. శ్రీదివ్య అండ్ పార్టీ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి ఏలూరు ప్రాంతీయ కార్యాలయం సౌజన్యంతో గురువారం ఏర్పాటు చేసిన కళాజాతా ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్లాస్టిక్ భూతం, పారిశుద్ధ్యం, పర్యావరణ కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై కళాజాతా బృందం లఘు నాటికల ద్వారా, పాటల ద్వారా, కామెడీ సన్నివేశాలతో అర్థమయ్యేలా వివరించారు.

నేటి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్ సర్వీసులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్‌కు శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభిస్తున్నామని నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి నుంచి నూజివీడు, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు బస్ సర్వీసు నడుపుతున్నామని చెప్పారు. గురువారం ఆగిరిపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో సిబ్బందితో కలిసి బస్టాండ్ ఆవరణను శుభ్రం చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎస్‌ఐ శుభశేఖర్



ఆగిరిపల్లి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యజీవితంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు పెంచుకొని ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే తీసుకునే చర్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యోహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ

ఆగిరిపల్లి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సిబ్బందితో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాం పరిసరాలను గురువారం పరిశుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషణకు గడ్డుకాలం

- వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన ఎండు గడ్డి
- ఐదు రోజులకు సరిపడా అరకొరగా ఉచిత దాణా పంపిణీ
- అదనంగా కావాలంటే కిలో దాణాకు రూ.6.50 చెల్లించాలి
- ఎండు గడ్డి బొద్దు రూ.200కి కొనుగోలు చేస్తున్న రైతులు



హెచ్. ముత్యాలంపాడు గ్రామంలో వరద ప్రవాహానికి కాల్వలో మేట వేసిన వరిగడ్డి కట్టలు



హెచ్. ముత్యాలంపాడు గ్రామ శివారులో వరద ముంపునకు గురైన గడ్డివాము

జి.కొండూరు: వరద ముంపుతో సర్వం కోల్పోయి ప్రజలు అల్లాడుతున్నారు. ముంపు బారిన పడి ఖరీఫ్ సాగు దెబ్బతింది. అంతంత మాత్రంగా ఉన్న పశుపోషణ భారంగా మారింది. వరద ప్రవాహానికి పశు గ్రాసం కోల్పోయి రైతులు కష్టాల్లో ఉన్నారు. అండగా ఉండాల్సిన ప్రభుత్వం అరకొరగా పశువుల దాణా పంపిణీ చేసింది. అదనంగా కావాలంటే కిలో దాణా రూ.6.50కు ఇస్తామంటూ రైతులకు ఆఫర్ ఇచ్చింది. వరద ముంపుతో తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు దాణా కొనుక్కోవాలంటూ ప్రభుత్వమే చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బొద్దు గడ్డి రూ.200

గడ్డివాములు వరద ప్రవాహంలో కొట్టుకుపోగా పలు గ్రామాల్లో వరద ముంపులో రోజుల తరబడి ఉండిపోవడంతో గడ్డి కుళ్లి పోయింది. ఎండుగడ్డి బొద్దు రూ.200లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే దాణా ఐదు రోజులకు మాత్రమే సరిపోవడంతో పశువుల పోషణ ఎలా అని పాడి రైతులు తలలు పట్టుకుంటున్నారు.

పొంచి ఉన్న కొరత..

వరద ముంపులో 90 శాతం వరిపైరు పూర్తిగా కుళ్లి పోవడంతో భవిష్యత్‌లో ఎండుగడ్డికి కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే పశుపోషణ భారంగా మారిన పరిస్థితులలో వరద ప్రవాహంతో పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది.

ఉచిత దాణా పంపిణీ ఇలా

మైలవరం నియోజకవర్గంలో వరద ప్రభావిత గ్రామాల్లో పశువుల మేత కోసం ప్రభుత్వం అరకొరగా ఉచిత దాణాను పంపిణీ చేసింది. ఒక్కొక్క పశువుకి రోజుకు ఐదు కిలోల చొప్పున ఐదు రోజులకు సరిపడా దాణాను అందించారు. మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధిలో 2,040 పశువులకు గానూ 51 టన్నులు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 5,120 పశువులకు గానూ 128 టన్నులు, విజయవాడ రూరల్ పరిధిలో 3,240 పశువులకు గానూ 81 టన్నుల దాణాను పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు.

నియోజకవర్గంలో పశు సంపద

మైలవరం మండల పరిధిలో ఆవులు, గేదెలు 29,966, మేకలు, గొర్రెలు 39,063, జి.కొండూరు మండల పరిదిలో గేదెలు, ఆవులు 13,821, మేకలు, గొర్రెలు 15,794, రెడ్డిగూడెం మండల పరిధిలో గేదెలు, ఆవులు 8,382, మేకలు, గొర్రెలు 12,657 ఇబ్రహీంపట్నం మండల పరిధిలో గేదెలు, ఆవులు 12,452, మేకలు, గొర్రెలు 10,820, విజయవాడరూరల్ పరిధిలో గేదెలు, ఆవులు 14,265, మేకలు, గొర్రెలు 8,112 వరకు ఉన్నాయి.

వరిగడ్డి కొట్టుకుపోయింది



మాకు పది గేదెలు ఉన్నాయి. వరద ప్రవాహానికి 700 బొద్దుల వరిగడ్డి కొట్టుకుపోయింది. గేదెలకు మేత ఎక్కడి నుంచి తీసుకురావాలో అర్థం కావడం లేదు. బొద్దు గడ్డి రూ.200 పెట్టి కొనుగోలు చేశాం. ఈ విధంగా గడ్డి కొని పశువులను పోషించాలంటే కష్టమే. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి. దాణాను ఉచితంగా అందించాలి.

– మిరియాల రమాదేవి, పాడి రైతు, హెచ్. ముత్యాలంపాడు

దాణాను ఉచితంగా పంపిణీ చేయాలి



వరద ప్రభావం వల్ల పశువులకు మేత లేదు. ప్రభుత్వం ఖరీఫ్ పూర్తయ్యే వరకు ఉచితంగా దాణాను పంపిణీ చేయాలి. పశువులకు అవసరమయ్యే మందులను కూడా ఉచితంగా అందించాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో పశువుల మేతను కొనుగోలు చేయాలంటే భారంగా మారుతుంది.

– చెరుకూరి వెంకట నరసింహారావు, పాడి రైతు, కవులూరు

ఘనంగా కార్మిక విద్యా దినోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మిక విద్యా దినోత్సవం కొండపల్లిలో గురువారం ఘనంగా జరిగింది. జాతీయ కార్మిక విద్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్మిక విద్యాధికారి, ఇన్‌చార్జ్ రీజినల్ డైరెక్టర్ మహేశ్వరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్మిక విద్యపై సంస్థ ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన శిబిరాల్లో దేశంలోని అన్ని భాషల్లో కార్మికుల పిల్లలకు విద్యపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికుల హక్కులు, ఆరోగ్యం, మహిళా సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సాయి గణేష్, మెప్మా ఏపీఎం దయావతి, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు కె.నరేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నరసమ్మ, వెంకయ్య పాల్గొన్నారు.

23లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ఎ.కొండూరు: రైతులు ఈనెల 23వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి టిప్పుసుల్తాన్ అన్నారు. ఈ క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ చేసిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. మండలంలోని రైతులు తమ పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

జి.కొండూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌లో వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు రక్షణ కల్పించేందుకే 'పోక్సో'

రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శివపార్వతి

నూజివీడు: లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకే పోక్సో చట్టాన్ని రూపొందించారని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. శివపార్వతి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో గురువారం విద్యార్థినులకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి శివపార్వతి మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు, తీవ్రమైన లైంగిక వేధింపు కేసుల్లో మరణశిక్ష, జరిమానా సైతం విధిస్తారని చెప్పారు. ఆడపిల్లలు చక్కగా చదువుకోవాలని, జీవితంలో తమ కాళ్లపై తాము స్థిరపడిన తరువాత మాత్రమే పెళ్లి గురించి ఆలోచించాలన్నారు. బాల్య వివాహ రహిత పట్టణంగా నూజివీడును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లలకు పుస్తకంలోని పాఠాలే కాకుండా నైతిక విలువలు, నీతి కథలు, ఇతరులతో వ్యవహరించాల్సిన తీరు, నడవడిక, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక బాధ్యత తదితర అంశాలను నిరంతరం చెబుతూ ఉండాలన్నారు. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరిన స్ఫూర్తిదాతల గురించి పిల్లలకు వివరించాలని సూచించారు. సీనియర్ న్యాయవాది నండూరి పద్మాంజలి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బసవరాజు రామకృష్ణ, హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, న్యాయవాది కె. జాన్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

ముసునూరు: తృణధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని, గర్భిణులు అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ఎస్వై నూరాని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం చెక్కపల్లి, బలివే గ్రామాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. చెక్కపల్లి కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్స్ తింటూ అనారోగ్యాల బారిన పడవద్దని, పోషకాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. అనంతరం 20 మంది గర్భిణులకు సాముహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ పుష్పవతి, ఏసీడీపీఓ నాగేశ్వరి, మహిళా పోలీస్ కేవీ రమణ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మైలవరంలో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మైలవరం: స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో గురిజా లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోడూరు మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మెడ్ స్టార్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈసీజీ, 2డీ ఎకో, కార్డియాలజీ కన్సల్టేషన్ ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. విజయ చైతన్య వైద్య పరీక్షలు నిర్వహించారు. మైలవరం జమీందారు ఎస్‌వీఎస్ నివృతరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూతలపాటి బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

- ఇబ్రహీంపట్నం: కోడూరు లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంవీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం ప్రారంభించారు. విజయవాడకు చెందిన పలు వైద్యశాలల వైద్య సిబ్బంది మధుమేహం, బీపీ, గుండె, ఫిట్స్, వెన్నెముక, నరాల పటుత్వం, స్త్రీల సమస్యలు, కంటి పరీక్షలు, ఈసీజీ నిర్వహించి మందులు అందజేశారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ



నిత్యావసర వస్తువుల కిట్ అందజేస్తున్న ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ తదితరులు



వరద బాధితులకు కిట్లు అందజేస్తున్న మోహనరావు

మైలవరం: వరద బాధిత 1200 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను మైలవరం ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో గురువారం అందజేశారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో కతోలిక మిషనరీ సంస్థలు వెంటనే స్పందించి ముందుకు వచ్చి సహాయం చేస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడ బిషప్‌కు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి. సునీల్‌రాజు, గూన్జ్ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

- విస్సన్నపేట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం 160 కుటుంబాలకు స్థానిక శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువగల వంట పాత్రలు, దుప్పట్లు, టవల్స్ కిట్స్‌ను గురువారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,50,000 చెక్కును తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి చేతుల మీదుగా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకుడు జి. మోహనరావుకు సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ మేడా మోహనరావు అందజేశారు. సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్ మేడా శ్రీహర్ష, కరస్పాండెంట్ మోరంపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.
- భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద బాధితులకు గొల్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. గొల్లపూడి పరిధిలోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ సొసైటీ సౌజన్యంతో టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నూతలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు 184మంది ఎంపిక



జి.కొండూరు: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు 184మంది విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక శాగం శివరామిరెడ్డి జెడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ముగిశాయి. అండర్-14, 17 విభాగాలలో ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, కబడ్డీ పోటీలకు బాలురు, బాలికలు కలిపి 250మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలు కలిపి ఖోఖో జట్లకు 48 మంది, వాలీబాల్ జట్లకు 48 మంది, షటిల్ బ్యాడ్మింటన్‌కు 20 మంది, చెస్‌కు 20 మంది, కబడ్డీకి 48 మందిని ఎంపిక చేశారు. వీరంతా నియోజకవర్గ స్థాయిలో పోటీ పడనున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, పీడీ సీజర్ రెడ్డి, పీఈటీ మాధవరావు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వారి క్యాంపు కార్యాలయాల్లో విడివిడిగా యూనియన్ నాయకులు గురువారం వినతిపత్రాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉన్నందున కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. టీఎన్‌టీయూసీ బ్రాంచి అధ్యక్షుడు స్వతంత్ర కుమార్, ప్రధాన కార్యదర్శి మండదపు దుర్గారావు, రత్నశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా రక్షణ సైన్యం ఆవిర్భావ దినోత్సవం

ముసునూరు: ప్రేమ, శాంతి, రక్షణ మార్గాల్లో ప్రజలను నడిపేందుకు రక్షణ సైన్యం సంస్థను ప్రారంభించారని సంఘ పాస్టర్ కెప్టెన్ ఎం.రాజు అన్నారు. ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, పెదపాటి వారిగూడెం, వేల్పుచర్లలోని రక్షణ సైన్యం చర్చిల వద్ద గురువారం సంస్థ భారత దేశ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముసునూరులో పాస్టర్ రాజు, వనిత దంపతులు సంఘ సభ్యులతో కలిసి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విశ్వాసులకు శాంతి, రక్షణ సందేశాన్ని అందించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో చర్చి సంఘ పెద్దలు, యాకోబు, రవి, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆటల పోటీలు

ఎ.కొండూరు: ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి ఆటల పోటీలు ఈనెల 21, 23 తేదీల్లో నిర్వహించాలని ఎంఈఓ-2 కేశవరావు అన్నారు. కంభంపాడు జెడ్పీపీ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాలల వ్యాయామోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఆధార్‌కార్డు జిరాక్స్ ఎంట్రీఫామ్‌తో జత చేసి తీసుకోవాలని, అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా ఆటలు పోటీలు నిర్వహించాలని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హులన్నారు. సమావేశంలో మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి మండల స్థాయి పోటీలు..

విస్సన్నపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు ఈ నెల 23, 24 తేదీలలో మండలంలోని నరసాపురం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయని వ్యాయామోపాధ్యాయులు ఎస్. భాస్కర్, ఎం. రమేష్ గురువారం తెలిపారు. అండర్ 14, అండర్ 17 కేటగిరీలో బాలురు, బాలికలకు గేమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా ప్రొఫార్మా తీసుకురావాలన్నారు. వివరాలకు సెల్: 91778 67889 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

- నూజివీడు: ఎస్‌జీఎఫ్ నూజివీడు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు శుక్రవారం నుంచి పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తామని పాఠశాల హెచ్‌ఎం బి. హేమలత గురువారం తెలిపారు. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, చెస్, యోగా పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీలకు అవసరమైన కోర్టులను సిద్ధం చేశామన్నారు. వ్యాయామోపాధ్యాయులు అన్నామణి, వనజ, నాగరాజు, సుగుణరావు, రవీంద్ర, స్వప్న, రాజేంద్రప్రసాద్, సరళ, రాణి, ఆరతి పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం హైస్కూల్లో గురువారం మండల స్థాయి పాఠశాలల ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఈటీ సతీష్ ఆధ్వర్యంలో టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజా, హైస్కూల్ హెచ్‌ఎం బక్కయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మైలవరం: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని అమరావతి మహిళా మండలి ప్రతినిధి కాటమనేని కృష్ణవేణి అన్నారు. మైలవరం ఎస్ఎస్‌కే స్కూల్‌లో అమరావతి మహిళా మండలి ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పొందిన 14 మంది మహిళలకు గుప్త రామతులసి, కాటమనేని కృష్ణవేణిల సౌజన్యంతో కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో అమరావతి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌తో సమస్యలకు పరిష్కారం

ఎస్‌ఎఫ్‌ఎస్ సొల్యూషన్స్ రిసోర్స్‌పర్సన్ శిరీష

మైలవరం: ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు సమస్య పరిష్కారానికి శక్తివంతమైన సాధనాలుగా మారాయని ఎస్‌ఎఫ్‌ఎస్ సొల్యూషన్స్ రిసోర్స్‌పర్సన్ డి. శిరీష అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు సీఎస్‌ఐ, ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై రెండు వారాలపాటు నిర్వహించే వర్క్‌షాపును గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ మనకు ఎలా ఉపయోగపడతాయి, ఎలా మన పరిసరాల్లోని సవాళ్లను అధిగమించడానికి తోడ్పడతాయో వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి మాట్లాడారు. డీన్ అకడమిక్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, డీన్ ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ వి. సూర్యనారాయణ, ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీనివాసరావు, సీఎస్‌ఐ స్టూడెంట్ బ్రాంచ్ ఇన్‌చార్జి డాక్టర్ నాగాంజనేయులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతో ఆనందమయ జీవితం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంతో ఆనందమయ జీవితం గడపాలని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్ అన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సాంత్వన ప్రాజెక్ట్ కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం మూలపాడులో గురువారం నిర్వహించారు. ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలపై ఆయా గ్రామాల సర్పంచులతో సమీక్షించారు. ప్రజలకు తోడ్పాటు అందించే సాంత్వన ప్రాజెక్ట్ కార్యక్రమాలకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచులు చింతల భూలక్ష్మి, రెంటపల్లి నాగరాజు, నెలకుర్తి ఆశాలత, డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీహెచ్‌ఓ నారాయణ, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కేశవ పాల్గొన్నారు.

ఆర్కే కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ డేటా సైన్స్ అంశంపై జరిగిన రెండు రోజుల వర్క్‌షాపు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ టెక్నాలజీని ఉపయోగించే విధానం మన జీవితంలో అనుసంధానం చేసుకునే పద్ధతులను కళాశాల ప్రిన్సిపాల్ కొండ్రగుంట రామకృష్ణయ్య వివరించారు. ఇటువంటి వర్క్‌షాపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్స్‌పర్సన్ రవితేజ, వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్, కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

నూజివీడు, ది.19.09.2024 ఇట్లు : మస్తాల రమేష్